# మరమ్మతుకు నోచుకోని మత్తడి

- గతేడాది వరద ఉధృతికి ధ్వంసమైన మత్తడి
- చుక్క నీరు లేక ఎడారిలా మారిన తమ్మడపల్లి(ఐ) పెద్ద చెరువు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



వరదల ఉధృతికి ధ్వంసమైన తమ్మడపల్లి (ఐ) పెద్ద చెరువు మత్తడి



మత్తడి వద్ద కోతకు గురైన పంట పొలాలు

**జఫర్‌గఢ్:** గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలు, వరద ఉధృతి మూలంగా మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో ఉన్న పెద్ద చెరువుకు సంబంధించిన మత్తడి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో చెరువులో చుక్క నీరు లేక ఎడారిలా మారింది. ఇదే చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆయకట్టు రైతులు నీటి కోసం పాట్లుపడుతున్నారు గ్రామ చెరువు 10 ఫీట్ల సామర్థ్యంతో సుమారు 600 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు కింద ఎక్కువ శాతం చిన్న సన్నకారు రైతులకు సంబంధించిన పంట పొలాలు ఉన్నాయి. చెరువు పారకంతో పాటు బోర్లు, బావుల కింద అధారపడి రైతులు వరి పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది ఒక్క సారిగా భారీ వర్షాలు కురియడంతో వరద ఉధృతికి చెరువు సంబంధించిన మత్తడి పూర్తిగా ధ్వంసమై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో చెరువులో చుక్క నీరు నిల్వకుండా బయటకు వెళ్లింది. ఈ వరద తాకిడికి చెరువు కింద ఉన్న పంట పొలాలు కూడా ధ్వంసమై ఇసుక మెటలు వేయగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించి చెరువు మత్తడిని పునరుద్ధరించడంతో పాటు కట్ట మరమ్మతు పనులు చేపట్టి ఆదుకోవాలని రైతులు కోరారు.

### గత వానాకాలంలో మత్తడి కొట్టుకుపోయింది



గత వానాకాలంలో చెరువు మత్తడి కొట్టుకపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనివల్ల చెరువులో చుక్క నీరు నిల్వకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో పాటు చెరువు పారకం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికే వర్షాలు పడుతుండడంతో వెంటనే మత్తడి పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– రడపాక వెంకటయ్య, రైతు

### మత్తడి పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలి



కొట్టుకుపోయిన చెరువు మత్తడికి ఇప్పటి వరకు మరమ్మతు పనులు చేపట్టలేదు. చెరువులో చుక్క నీరు లేక మూగజీవాలకు కూడా నీరు కరువయ్యింది. ఈ యాసంగిలో చెరువు కింద ఉన్న బోర్లల్లో నీటి మట్టం తగ్గి కొంత మేర పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు. అధికారులు స్పందించి మత్తడి మరమ్మతు పనులు చేపట్టాలి.

– మంద బుచ్చయ్య, రైతు

# రైతుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రఘునాథపల్లి: సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**రఘునాథపల్లి:** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని కుర్చపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఎస్ఈ వేణుమాదవ్, డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఈఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ అనిల్‌కుమార్, తహసీల్దార్ మోహ్సిన్‌ముజ్తబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ రాహుల్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి**

కుర్చపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కొనుగోలు చేశారు..నిల్వ ఉన్న ధాన్యం వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే మిల్లులకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

**లో ఓల్టేజీ పరిష్కారానికే నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం**

**చిల్పూరు:** విద్యుత్ లో ఓల్టేజీ సమస్యల పరిష్కారం కోసమే 33/11కేవీ నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కొండాపూర్ గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. చిల్పూరు ఏఈ గోలి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ సరస్వతి, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఎడవెల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.

**నియోజక వర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం**

**స్టేషన్‌ఘన్‌పూర్:** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో నూతనంగా చేపట్టనున్న ఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం డీఈ రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎస్ఈ వేణుమాధవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, ఎస్ఏఓ జయరాజ్, ఏఓ రమేష్, ఏడీఈలు రణధీర్‌రెడ్డి, శ్రీనివాస్, ముంతాజ్‌హుస్సేన్, ఏఈలు శంకర్, భువనేశ్వరి, శివకుమార్, విశ్వసాహితి, ఫోర్‌మన్ ఎడ్ల రాజేందర్, ఎల్ఐలు, లైన్‌మన్లు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఘనంగా పెద్దమ్మతల్లి ఉత్సవాలు



పూజలు చేస్తున్న పురోహితులు

**స్టేషన్‌ఘన్‌పూర్:** నమిలిగొండ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు పాలకుర్తి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పాలకుర్తి గౌతమ్‌శర్మ, కిషోర్‌శర్మ వేదమంత్రాల మధ్య ఘనంగా హోమం పూజలు నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు., అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోల రాజయ్య, ఉపాధ్యక్షుడు నీల రాజయ్య, కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, ముదిరాజ్ సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

### 'సమస్యల పరిష్కారానికి సంఘాలు ఒక్కటవ్వాలి'

**బచ్చన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటే సంఘాలన్ని ఒక్కటై పోరాడాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మల్లాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్లు, సఫాయిల సంఘాలు అన్నీ ఒకే తాటిపైకి రావాలన్నారు. సంఘాల్లోని అధ్యక్ష, కార్యదర్శులు వేర్వేరుగా ప్రభుత్వం వద్దకు వెళ్లడంతో సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. జీపీ సిబ్బంది పర్మనెంట్ కోసం జీఓ 51 ఎత్తివేత, కారోబార్, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్‌కు పాటుపడాలన్నారు. తేలుకంటి మురళి, కాళ్ల ప్రభాకర్, గొల్లపల్లి బాబుగౌడ్, కొముర్రెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


### 'గత ప్రభుత్వాలే గ్రంథాలయాలను నిర్వీర్యం చేశాయి'



మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

**నర్మెట:** గత ప్రభుత్వాలు గ్రంథాలయాలను నిర్వీర్యం చేశాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీచేసిన ఆయన భవనాన్ని, పుస్తకాలను, పరిసరాలను పరిశీలించి జిల్లా సెక్రెటరీ మొగిలిగిద్ద సుధీర్‌తో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శ్రీధర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

### నివాళి



**జనగామ:** వైరా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. బుధవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే అంత్యక్రియలకు పల్లా హాజరై మదన్‌లాల్ పార్థివ దేహంపై పూలు చల్లి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఎన్టీఆర్‌కు నివాళి

**రఘునాథపల్లి/జఫర్‌గఢ్:** దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని రఘునాథపల్లి, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బొక్క రామచంద్రయ్య, ఎడ్ల మల్లేష్, జహంగీర్, నర్సింగరావు, అడ్డూరి శ్రీనివాస్, దశరథ, నాగేష్, శ్రీహరి, యాదగిరి, సీహెచ్ సోమనర్సయ్య, కాసర్ల ఏలీయా, నీలం సారంగం తదితరులు పాల్గొన్నారు.

# 'వర్గీకరణ ఉద్యమంతోనే ఆత్మగౌరవం'



మాట్లాడుతున్న ఎలిషా

**దేవరుప్పుల/లింగాలఘణపురం:** ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంతోనే దళితులకు ఆత్మగౌరవం పెరిగిందని ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రధాన కార్యదర్శి పెరెళ్ల ఎలిషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల ఆర్థిక అసమానతలు తొలగాలనే ఆకాంక్షతో ఏబీసీడీ వర్గీకరణ తదితర పీడిత ప్రజానీకం కోసం ఉద్యమం చేపట్టిన మంద కృష్ణ మాదిగ కృషి ఫలితమే ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారం దక్కిందన్నారు. ఈ నెల 31 న వరంగల్‌కు రానున్న మంద కృష్ణకు ఘనస్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, రాష్ట్ర నాయకుడు ఇనుముల నరసయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు బట్ట యాదగిరి , జోగు వెంకీ ఎల్లయ్య, ఎంఎస్పీ నాయకులు సుదర్శన్, కిరణ్, మనోజ్, ఉప్పుల రోహిత్, సిద్ధు, గడ్డం స్వామి పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఏలిషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు ఉపేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల హర్షం



సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**కొడకండ్ల:** ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను పాలకుర్తి నియోజకవర్గానికి మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వెలిబుచ్చారు. రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయడంపై బుధవారం మండలకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మండల అధ్యక్షుడు యాకేష్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మాట నిలబెటుకున్న ఎమ్మెల్యే**

ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మంజూరు చేయించిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్‌లు అన్నారు. స్కూల్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కీసర సునీల్‌రెడ్డి, మురారిశెట్టి అంజయ్య, యాకేష్‌యాదవ్, పనస శ్రీనివాస్, ఖలీం, వెంకన్న తదితరులు ఉన్నారు.

### పాత పాఠ్యపుస్తకాలు మరో విద్యార్థికి అందించండి

**జనగామ:** వచ్చే నెల12వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాత పాఠ్య పుస్తకాలను నిరుపేద విద్యార్థులకు అందించేందుకు అమ్మ ఫౌండేషన్ తో చేతులు కలపాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మంతె న మణి, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో పై తరగతులకు వెళ్లే విద్యార్థులు పాత పాఠ్య పుస్తకాలను దిగువ తరగతిలో చేరే వారికి ఉచితంగా అందించి మానవత్వం చాటుకోవాలని పిలుపునిచ్చారు. పాఠ్య పుస్తకాలను అమ్మఫౌండేషన్‌కు అందిస్తే, పేద పిల్లలకు అందించడం జరుగుతుందన్నారు. దాతలు 9959922361, 9603577635 ఈ నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# 'కగార్' పేరిట ఉద్యమకారులపై ఉక్కుపాదం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

**దేవరుప్పుల:** ఆపరేషన్ కగార్ పేరిట ప్రజా ఉద్యమకారులపై పోలీసు బలగాలచే ఉక్కుపాదం మోపడం తగదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జోన్, జనగామ జిల్లా ఉమ్మడి ప్రాంతాల పార్టీ, అనుబంధ సంఘాల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థలపై తిరుగుబావుట వేసి ఆదివాసీల సంక్షేమం కోసం పాటుపడుతున్న మావోయిస్టులను సరిహద్దు బలగాలచే ఎన్‌కౌంటర్ పేరిట రక్తపాతం సృష్టించడం బీజెపి పాలసీగా కొనసాగుతుందన్నారు. రైతు భరోసా నాలుగు ఎకరాల్లోపు వారికి ఇచ్చి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే కౌలు రైతుకు రైతు భరోసా కల్పించకుంటే ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారి రవికుమార్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రీ అహల్య, రాయపర్తి రాజు, రమేశ్, రాయపర్తి సోమన్న, మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**కొడకండ్ల:** ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపునిచ్చిన తరహాలోనే ప్రతి రైతుకు 11 నంబర్ల విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి తెలిపారు. బుధవారం చెరువుముందు తండాలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

**చిల్పూరు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన ఇతర పథకాలు పొందాలంటే రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఏఈఓ వినయ్‌కుమార్ అన్నారు. వంగాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

**స్టేషన్‌ఘన్‌పూర్:** ఇప్పగూడెం గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ 1999–2000 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండున్నర దశాబ్దాల అనంతరం తాము చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్న బాల్యస్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ బాల్యస్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జలమయమైన రోడ్లు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**స్టేషన్‌ఘన్‌పూర్:** మండల పరిధిలోని మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షంతో డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో పలు రోడ్లు జలమయంగా మారాయి. ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు, దిగువన ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారినా రోడ్లు, డ్రెయినేజీల తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు.

### డల్లాస్‌లో ఎర్రబెల్లికి ఎన్ఆర్ఐ గులాబీ శ్రేణుల ఘన స్వాగతం



ఎర్రబెల్లికి స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

**దేవరుప్పుల:** అమెరికాలో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవాలు పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డల్లాస్ ఎయిర్‌పోర్టుకు బుధవారం ఉదయం (అమెరికా కాలమానం) చేరుకోగా ఎన్ఆర్ఐ గులాబీ శ్రేణులు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. ఎర్రబెల్లితో ఎన్ఆర్ఐలు వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా ఉత్సవ వేదిక వరకూ బయలు దేరారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

**చిల్పూరు:** కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి కుమారస్వామి, బీజేపీ మండల నాయకుడు వెలిశాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ధాన్యం సమయానికి కొనుగోలు చేసి మిల్లులకు తరలించకపోవడం వల్లే తడిసిందన్నారు. వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

# క్రీడా శిబిరాలతో నైపుణ్యం

- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



చెస్ ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)



చిల్పూరు పాఠశాలలో యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

**చిల్పూరు:** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాలతో వారిలో నైపుణ్యం పెరుగుతోంది. ఈ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కోచ్‌ల ద్వారా క్రీడల్లో మెళకువలు నేర్చుకుంటున్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా మండలంలో ఏడు పాఠశాలల్లో వేసవి క్రీడా శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు చెస్, క్యారమ్స్, రింగ్ బాల్, స్కిప్పింగ్, షెటిల్, కబడ్డీ, యోగా లాంటివి నేర్పిస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా వాలంటీర్‌ను కూడా నియమించారు.

### చాలాబాగా నేర్పుతున్నారు



మా పాఠశాలలో క్రీడా శిబిరం ఏర్పాటు చేసినప్పటి నుంచి వెళ్తున్నా. చాలా బాగా నేర్పుతున్నారు. ఇష్టం అయిన ఆటలో నైపుణ్యం పెంచుకుంటున్నా.

– జ్యోతి, 10వతరగతి

### ఆటలంటే భయం పోయింది



ఆటలంటే భయంగా ఉండేది. మా పాఠశాలలోనే ఉత క్రీడా శిబిరం ఏర్పాటు చేయడంతో భయం లేకుండా నచ్చిన క్రీడలో శిక్షణ పొందుతున్నా. యోగా ఎంతో ఉపయోగంగా ఉంది.

– సందీప్, 10వ తరగతి

### శిబిరాల ఏర్పాటు మంచి పరిణామం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం మంచి పరిణామం. క్రీడాకారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. శిక్షణ పొందిన వారు రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించే అవకాశం ఉంది.

– దాసరి గోవర్ధన్, ఎంఈఓ

**అడ్మిషన్లు పొందాలి**

**రఘునాథపల్లి:** వెల్ది మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితా ప్రకటించామని, అట్టి విద్యార్థులు వెంటనే అడ్మిషన్లు పొందాలని ప్రిన్స్‌పాల్ పాలకుర్తి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికల హాస్టల్‌లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నందున ఈ నెలాఖరులోగా అడ్మిషన్లు పొందాలని ఆయన సూచించారు.

## సంక్షిప్త సమాచారం

**బాధిత కుటుంబాలకు సాయం**

**దేవరుప్పుల:** చిన్నమడూరులో మృతి చెందిన మేడ గౌరయ్య కుటుంబానికి బీఆర్ఎస్ మండల నాయకుడు, ఏఎంసి మాజీ డైరెక్టర్ మైదం జోగేశ్వర్ 50 కిలోల బియ్యం బుధవారం అందించారు. అలాగే ధర్మాపురంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నబోయిన దేవరాజ్ యాదవ్ తండ్రి కన్నబోయిన అచ్చయ్య మృతి చెందగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

**నర్మెట:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు ఓబుల్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 267 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచిత మందులను, కిట్లను అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గురువారం ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కన్నెబోయిన కుమార్, ముక్కెర మహేందర్, పొన్నం బాలకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**నదీ జలాలతో అభిషేకం**

**బచ్చన్నపేట:** కేసిరెడ్డిపల్లి గ్రామంలోని శివాలయంలో నదీ జలాలతో పరమ శివుడికి అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకులు ముక్తేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వర చండీశ్వర్ స్వామి దేవాలయ సన్నిధిలో త్రివేణి సంగమంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్లినట్లు తెలిపారు. ఆ నదీ జాలాలను తీసుకొచ్చి భక్తి శ్రద్ధలతో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గాలి తిరుపతి, ఇమ్మడి రాధాభాయి, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

**విరాళం**

**బచ్చన్నపేట:** నక్కవానిగూడెం శివారు గ్రామమైన సదాశివపేట గ్రామంలో హనుమాన్ గుడికి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన జంగిటి ప్రకాశ్ రూ.11,100 విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ జూన్ 2న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

**పరామర్శ**

**నర్మెట:** మండలకేంద్రానికి చెందిన జేరిపోతుల లక్ష్మి (65) అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసరాలతో పాటు ఆర్థికసాయం అందజేశారు.